క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

వాజేడు : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. మండలంలోని శ్రీరాంనగర్ బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాలలను, వంటలను పరిశీలించడంతో పాటు విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

జాతీయ రహదారిపై తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు : మండల పరిధిలోని పూసూరు గోదావరి బ్రిడ్జి సమీపంలో స్థానిక ఎస్సై జక్కుల సతీశ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. జాతీయ రహదారిపై వచ్చి పోయే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకుని పంపించారు.

పెసా గ్రామసభలకు తేదీలు ప్రకటించాలి



వినతిపత్రం అందజేస్తున్న మొబలైజర్లు

వాజేడు : మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పెసా గ్రామ సభలకు తేదీలను ప్రకటించాలని కోరుతూ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడికి పెసా మండల మొబలైజర్లు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ ఆదేశాల ప్రకారం మండలంలోని జీపీల వారీగా ఉన్న సమస్యలను గుర్తించి తీర్మానాలు చేసి ఐటీడీఏ పీఓకు పంపించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఇండ్ల సమ్మయ్య, పెండికట్ల కృష్ణ, మేకల సుశీల, అనిల్ కుమార్, వెంకటేష్ ఉన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసు నమోదు

ములుగు రూరల్ : నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలకు అందుబాటులో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం తిప్పని కృష్ణ, మూడ్ లక్ష్మీలపై కేసు నమోదు చేశామని అన్నారు. విద్యా సంస్థలకు సుమారు 100 మీటర్ల దూరంలో ఎలాంటి మద్యపానం, గుట్కా , అంబర్‌లు అమ్మకూడదని హెచ్చరికలు జారీ చేసినప్పటికి అతిక్రమించి మద్యం అమ్మకాలు చేపడుతున్న సమాచారం మేరకు తనిఖీ చేపట్టి మద్యం, బీర్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో కృష్ణ షాపులో రాయల్ స్టాగ్ 2 క్వాటర్లు, కేఫ్ లైట్ బీర్లు 03, మూడ్ లక్ష్మీషాపులో కేఫ్‌లైట్ 08, స్టాంగ్ బీర్లు 05 పట్టుపడ్డాయని తెలిపారు. విద్యా సంస్థలకు అందుబాటులో మత్తుపదార్థాల అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పాఠశాలలో రాఖీ వేడుకలు



విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం రాఖీ పండుగ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులుకు రాఖీలను కట్టుకొని పండుగ వైభవంగా జరుపుకున్నారు. దీంతో సంప్రదాయాలను, సంస్కృతులను కాపాడుకోవాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అందరూ సోదరభావంతో మెలగాలని హెచ్‌ఎం సూర్యనారాయణ తెలిపారు.

జోరుగా ఫార్మసీ దందా

- ఏజెన్సీలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మెడికల్ షాపులు
- ఎలాంటి అర్హత లేకుండా మందుల విక్రయాలు
- కన్నెత్తి చూడని వైద్యఆరోగ్యశాఖ



మంగపేట: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత మండలాల్లో ఫార్మసీ దందా జోరుగా సాగుతోంది. పట్టణం, మండల కేంద్రం మొదలుకుని మారుమూల పల్లెల వరకు మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆయా షాపులకు లైసెన్సు ఒకరిదైతే మరొకరు నిర్వహించడం సర్వసాధారణంగా మారింది. జిల్లాలోని వివిధ మండలాలతో పాటు ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాంతంలోని మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం (కె) మండల కేంద్రాలు మొదలుకుని మారుమూల పల్లెల వరకు కిరాణం షాపులను తలపించేలా గల్లీకో మెడికల్ షాపులను ఏర్పాటు చేసి ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో లక్షల్లో ఆదాయం ఉండటంతో ఎలాంటి అర్హత లేనివారు సైతం ఫార్మసీ వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు.

ఫార్మసీ సర్టిఫికెట్ తప్పనిసరి

మెడికల్ షాపు నిర్వాహకులకు తప్పనిసరిగా బీ, డీ ఫార్మసీ చేసి ఉండాల్సి ఉండగా కొందరు ఫార్మసీ సర్టిఫికెట్‌కు నెలకు రూ.8 వేల నుంచి 11 వేల వరకు అద్దెకు తీసుకుని వారి పేరుపై షాపులను నిర్వహిస్తున్నారు. కొందరు స్థానికంగా ఆర్‌ఎంపీ వైద్యులుగా చలామణి అవుతున్న ఎలాంటి అర్హత లేని వారితో కుమ్మక్కై వారి వద్దకు వైద్యం కోసం వచ్చే వారికి అవసరం లేకున్నా పెద్ద మొత్తంలో మందులను అంటగడుతూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని వచ్చిన ఆదాయంలో ఆర్‌ఎంపీలకు పర్సంటేజీగా ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారుల తనిఖీలు శూన్యం

మెడికల్ షాపులను పర్యవేక్షించాల్సిన వైద్య ఆరోగ్య శాఖ, డ్రగ్ కంట్రోల్ అధికారులు పలు మెడికల్ షాపులపై ఏళ్ల తరబడి తనిఖీలు నిర్వహించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. షాపుల్లో నిబంధనల మేరకు సర్టిఫికెట్‌లో పేరు ఉన్న ఫార్మసిస్టు ఉంటున్నాడా లేదా మందుల విక్రయాల రశీదులు, స్టాక్ వివరాలు తదితర రికార్డులు మెయింటెనెన్స్ చేస్తున్నారా లేదా మందులను భద్రపరిచేందుకు షాపుల్లో ఏసీ, ఫ్రిజ్, వంటి పరికరాలు ఉన్నాయా అనే తనఖీలు ఎక్కడ కూడా చేయకపోవడం గమనార్హం. మండలాల్లోని మెడికల్ షాపుల యజమానుల సంఘం నాయకుల మధ్యవర్తిత్వంతో ఒక్కో షాపు నుంచి నెలనెలా ముడుపులు స్వీకరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ఉన్నతాధికారులు స్పందించాలి

జిల్లాలో మెడికల్ షాపుల నిర్వహణపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, డ్రగ్ కంట్రోల్ అధికారులు ప్రతీ మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టు హాజరు, నిర్వాహణ రికార్డులను పరిశీలించాలి. నిబంధనలకు విరుద్ధంగా బినామీల పేరుతో నడుస్తున్న షాపుల లైసెన్సును రద్దు చేయాలి.

పరిశీలించి చర్య తీసుకుంటాం



మెడికల్ షాపుల నిర్వాహణపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పరిశీలించి వారిపై చర్యలు తీసుకునే విధంగా డ్రగ్ కంట్రోల్ అధికారుల దష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. – గోపాల్‌రావు, జిల్లా వైద్యాధికారి

బ్రిడ్జి కూలడంతో ప్రయాణికుల అవస్థలు

- ఏటూరునాగారంలో గంటల తరబడి పడిగాపులు



బస్టాండ్‌లో వేచిచూస్తున్న ప్రయాణికులు



మల్లంపల్లి బ్రిడ్జి వద్ద మళ్లింపు కోసం బారికేడ్లను ఏర్పాటు చేసిన పోలీసులు

ఏటూరునాగారం : ములుగు మండలంలోని మల్లంపల్లి వద్ద గురువారం బ్రిడ్జి కూలడంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. శుక్రవారం వాహనాలను పందికుంట మీదుగా వరంగల్‌కు మళ్లించారు. దూరభారం, సమయం ఎక్కువ కావడంతో పాటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు సకాలంలో రాకపోవడంతో పండుగ సందర్భంగా వచ్చిపోయే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వంతెన మరింత ప్రమాదంగా ఉండడంతో పోలీసులు వాహనాలను అనుమతించలేదు. దీంతో సాధారణంగా వరంగల్‌కు మూడు గంటల సమయం పట్టేది. ఇప్పుడు చుట్టూ తిరిగిపోవడం వల్ల మరో గంట అదనంగా సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. మరో రోడ్డు మార్గం జాకారం మీదు మళ్లించినప్పటికీ కూడా సమయం ఎక్కువగా పడుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. బ్రిడ్జి పనులు వేగంగా పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని వారు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు



వాజేడు : ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



వెంకటాపురం(ఎం): వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటున్న మహిళలు

వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జిల్లాలోని ఏటూరునాగారం, వెంకటాపురం(ఎం). (కె), తాడ్వాయి, వాజేడు మండలాల్లో ముత్తైదువులు శ్రావణమాసంలో రెండో శుక్రవారం కావడంతో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని నోచుకొని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. దీంతో ప్రతి ఇంటింటా వరలక్ష్మి వ్రతాల సందడి నెలకొంది. ఉదయం వేకువజామున తలంటు స్నానాలను ఆచరించి ఇంటిలో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసుకొని నూతనవస్త్రాలు అలంకరించి, పండ్లు, పూలు, వివిధ రకరకాల పిండి వంటలతో ప్రసాదాలను తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. ఇంటికి మహిళలను పిలుచుకొని పూలు, పండ్లు, గాజులతో, రవికతో వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఇస్తినమ్మ వాయినం... పుచ్చుకుంటినమ్మ వాయినం అంటూ ఆడపడుచుల సంప్రదాయాలతో సందడిగా మారాయి. వీటితోపాటు కంగన్‌హాల్స్, బట్టల షాపులు రద్దీగా మారాయి.

– సాక్షి, నెట్‌వర్క్

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



వెంకటాపురం(కె): బ్యాగ్‌లు, నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయుడు సూర్యనారాయణ



ఎస్‌ఎస్‌తాడ్వాయి: విద్యార్థినికి స్కూల్ బ్యాగ్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఒంటిమామిడి, బర్లగూడెం, మహితాపురం, నూగూరు, రాచపల్లి, కలిపాక, కొత్తగుంపు, నాయకులగూడెం గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుతున్న 400 మంది విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, నోట్‌బుక్స్, పెన్నులను అందజేశారు. కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం పి.సూర్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు అందజేయటం అభినందనీయమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని మరికొంత మంది ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సిబ్బంది ముర్రం రాజేష్, కంతి ముత్తయ్య, తదితరులు ఉన్నారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయి: గ్రేస్ సర్వీస్ సొసైటీ సేవా సంస్థ ఖమ్మం వారి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కాటాపూర్, గంగారం, కొౌశెట్టివాయి, ఏటూరునాగారం మండలంలోని ఆకులవారి ఘణపూర్ పాఠశాలల్లోని 300 మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పెన్నులు, నోట్‌బుక్స్, పలకలను ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పాయం మానేశ్వర్‌రావు మాట్లాడుతూ పాఠశాలల్లోని నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు విద్య సామాగ్రి పంపిణీ చేసిన గ్రేస్ సర్వీస్ సేవ సంస్థను అభినందించారు. గిరిజన ప్రాంతంలోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు మెటీరియల్ పంపిణీ చేయడం చాలా సంతోషమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సిబ్బంది జీఎస్‌ఎస్, ప్రతినిధులు ముర్రం రాజేష్, ముత్తయ్య,పుల్లారావు, ఉపాధ్యాయులు మల్లెల స్వప్న, వంశీ, రాంబాబు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము నివారణకు చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఇసుక లారీలతో లేస్తున్న దుమ్ము నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతు శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ మండల కేంద్రంలో రోజు వందల సంఖ్యలో ఇసుక లారీలు తిరుగుతుండటంతో పెద్ద ఎత్తున రోడ్లపై దుమ్ము లేస్తుందని అన్నారు. దుమ్ముతో రోడ్డు పక్కన ఉన్న కూరగాయల, తినుబండారాల షాపులపై పడి కలుషితమౌతున్నాయని అన్నారు. ఇసుక లారీలు రోడ్డుపై నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఇసుక ర్యాంప్‌ల వద్ద లారీలు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చిట్టెం ఆదినారాయణ, గుండమల్ల ప్రసాద్, ఇరుప శ్రీను, కోగిల మాణిక్యం, తోట నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

అమలుకు నోచుకోని మెనూ

- పట్టించుకోని గిరిజన సంక్షేమశాఖ అధికారులు



విద్యార్థులకు భోజనం వడిస్తున్న వర్కర్



పెచ్చులూడి ఇనుపచువ్వలు తేలిన స్లాబ్ పైకప్పు

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని కాల్వపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెనూ అమలుకు నోచుకోవడం లేదు. శుక్రవారం పాఠశాలను 'సాక్షి' సందర్శించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం వరలక్ష్మీ పండుగ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు ఆప్షన్ సెలువు ప్రకటించింది. పాఠశాల హెచ్‌ఎం అదనపు వార్డెన్ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. వార్డెన్ బాధ్యతలను కూడా నిర్వహిస్తుడడంతో అందుబాటులో ఉండాల్సిన ఆయన సెలవు సందర్భంగా ఇంటికి వెళ్లారు. వర్కర్లు మాత్రమే విద్యార్థులకు భోజనం తయారీ చేసి వండించారు. ప్రభుత్వం కొత్తగా పెంచిన మెస్ చార్జీల మెనూ ప్రకారం విద్యార్థులకు శుక్రవారం ఉడకబెట్టి కోడిగుడ్డు, పెరుగు, సాంబార్ పెటాల్సి ఉండగా వంకాయ కూర, చారుతోనే భోజనం పెట్టారు. సుమారుగా 70 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతుండగా 15 మందికిపైగా విద్యార్థులు భోజనం చేసినట్లు విద్యార్థులు తెలిపారు. నెలలో రెండు వారాలు మటన్, రెండు వారాలు చికెన్ విద్యార్థులకు పెట్టాలని మెనూ చెబుతుంది. కానీ నాలుగు వారాలు కూడా చికెన్ పెడుతున్నారని, మటన్ మాత్రం పెట్టడం లేదని సందర్శన సమయంలో కనిపించిన విద్యార్థులు తెలిపారు. సెలవు రోజుల్లో విద్యార్థుల బాగోగులు పట్టించుకున్న నాథులే లేరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వపల్లి దూరంగా ఉండడంతో గిరిజన సంక్షేమశాఖ ఉన్నాతాధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మెనూ అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెచ్చులుదుతున్న భవనం

విద్యార్థులు భోజనం చేసే భవనం గది పైకప్పు పెచ్చులూడి ఇనుపచువ్వలు తేలాయి. పాత భవనం కావడంతో మరమ్మతులకు వచ్చి పైకప్పు స్లాబ్ పెచ్చులుడుతుంది. విద్యార్థులు భోజనం చేసే సమయంలో పెచ్చులూడి విద్యార్థులపై పడే ప్రమాదం పొంచి ఉంది. భవనం పెచ్చులూడుతున్న అధికారులు మాత్రం మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులకు పడక మంచాలు కూడా వినియోగంలో లేకపోవడంతో తుప్పు పట్టి పోతున్నాయి. పాఠశాల నిర్వహణ అధికారి నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి భవన మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆప్యాయతల 'రక్షాబంధన్'

- అక్కాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా రాఖీ పండుగ
- సోదరులకు కట్టేందుకు సొంతూళ్లకు పయనం
- నేడు రాఖీ పౌర్ణమి



వెంకటాపురం (ఎం) : షాపు వద్ద రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

వెంకటాపురం(ఎం): అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి.. కనిపించే దైవమే ఆ కనులలో ఉన్నది.. అని ఓ చెల్లి తన సోదరుడి గురించి పాట పాడడంలో ఎంతో అర్థం ఉంది. తనను ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే అన్నయ్యలంటే ప్రతీ చెల్లికి అభిమానమే. సోదరీసోదరుల ఆత్మీయతకు అద్దం పట్టేదే 'రక్షాబంధన్'. ఇంటి ఆడపడుచు మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్టసుఖాల్లో మేము మీకు అండగా ఉన్నామన్న భరోసాను సోదరులు అక్కా చెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం ప్రత్యేకత. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ చిహ్నానికి, వారి మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని నేడు (శనివారం) జిల్లాలో ప్రజలు ఘనంగా జరుపుకోనున్నారు. అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకోసం సొంతూళ్లకు ఆడపడుచులు వస్తుండడంతో ప్రతీ ఇల్లు ఆడబిడ్డలతో కళకళలాడనుంది. అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపిస్తారు. ఇది వారి ప్రేమ, అనురాగానికి వారధిగా ని లుస్తుంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు ఆత్మీయులకు పోస్టుద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా రాఖీలను పంపారు.

గ్రామాల్లో మొదలైన రాఖీ సందడి

అనుబంధాలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చే హిందూ సంస్కృతిలో రక్షాబంధన్‌కు విశిష్టమైన స్థానం ఉంది. సోదరి, సోదరుల అనురాగానికి చిహ్నంగా ఈ వేడుక జరుపుకుంటారు. ఇళ్లల్లోనే కాకుండా ఆలయాల్లో, సామూహిక వేదికల వద్ద ఈ వేడుకలను అనందోత్సహాల మధ్య నిర్వహించుకోనున్నారు. యువతులు, మహిళలు రెండు రోజుల ముందు నుంచే రాఖీలు కొనుగోలు చేస్తున్నారు.

దీక్ష సంకల్పమే రక్ష

ఏదైనా కార్యక్రమం నిర్వహించ తలపెట్టినప్పుడు రక్షను ధరించడం హైందవ ఆచారం. కార్యక్రమం ఏ విఘ్నాలు లేకుండా సజావుగా సాగాలని, అనుక్షణం లక్ష్యాన్ని గుర్తు చేసేందుకు ఈ రక్షను ధరిస్తారు. వివాహం, యజ్ఞయాగాదులు, వ్రతాలు, నోములు తదితర కార్యక్రమాల్లో ఈ రక్షాధారణ తప్పనిసరి. పూర్వకాలంలో యుద్ధానికి వెళ్లే భర్తలకు భార్యలు, సోదరుల క్షేమాన్ని కాంక్షిస్తూ సోదరీమణులు రక్షలు కట్టేవారు. నాటి నుంచి ఆనవాయితీగా ఈ ఆచారం వస్తోంది.



వెంకటాపురం (కె) : రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

రేగొండ: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మొటం భారతి రేగొండ నుంచి పరకాలకు వెళ్తుండగా ఫోన్ ఎక్కడో పోగొట్టుకుంది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీఈఐఆర్ సెల్‌ఫోన్‌ను గుర్తించారు. ఈ మేరకు బాధితురాలికి శుక్రవారం ఎస్సై సందీప్‌కుమార్ అందజేశారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాటారం: మండల కేంద్రానికి చెందిన లచ్చయ్య, బయ్యారానికి చెందిన శరత్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను శుక్రవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. అలాగే ఎర్రగుంటపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుర్రాల నరసింహులు దంపతులను, గారెపల్లిలో లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మేకల అశోక్‌ను పుట్ట మధు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, తోట జనార్దన్, జక్కు శ్రావణ్, తైనేని సతీశ్, వంగల రాజేందర్, ఉప్పు సంతోష్, తదితరులు ఉన్నారు.

మల్హర్: మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గద్దం క్రాంతి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎల్కటి రాజయ్య

టేకుమట్ల: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు, ఫ్యాన్లు, వెంటిలేషన్, శానిటేషన్, తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మండలంలోని చాలా పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రేనుకుంట్ల రాము పాల్గొన్నారు.